మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల్/నారాయణపేట

## భూ సేకరణలో మరింత
# వేగం పెంచాలి

- ప్రాజెక్టుల భూ సేకరణపై కలెక్టర్ సమీక్ష
- సాగునీటి ప్రాజెక్టుల కోసం నిర్దిష్ట ప్రణాళికతో భూసేకరణ
- ప్రతివారం పురోగతి సమీక్షలో జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న కేఎస్ఐ, పాలమూరు-రంగారెడ్డి, మార్కండేయ, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్లో ఉన్న భూ సేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ రెవెన్యూ, నీటిపారుదల అధికారులతో భూ సేకరణ పురోగతి పనులపై ప్రతివారం నిర్వహించే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకు ఈ భూసేకరణ కీలకమని తెలిపారు. జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత వేగవంతంగా భూ సేకరణ పనులు కొనసాగించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత వారం జిల్లా కలెక్టర్ నిర్దేశించిన మేరకు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనులను ప్రాజెక్టుల వారీగా అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల పురోగతిని గమనిస్తూ, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేలా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎటువంటి ఆటంకం లేకుండా సాగేందుకు భూ సేకరణ కీలకమైన దశగా ఉన్న నేపథ్యంలో, అధికారులు వేగవంతంగా పని చేయాలని సూచించారు. భూమి కొలతలు, పరిహారం పంపిణీ, భూస్వాముల సమ్మతి వంటి ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. వచ్చేవారం సమీక్ష నాటికి మరింత పురోగతి సాధించాలనే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో, బాధ్యతతో, సమయపాలనతో పని చేయాలన్నారు. ప్రతి ప్రాజెక్టులో నిశ్చితమైన పురోగతిని సాధించేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులకు కలెక్టర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, రెవిన్యూ, వివిధ ప్రాజెక్టుల నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను
# పరిశీలించిన కలెక్టర్



ఈవిఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**నారాయణ పేట, జూన్ 13 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని బస్టాండ్ దగ్గరలో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సిక్త పట్నాయక్ శుక్రవారం అదనపు కలెక్టర్ లోకల్ బాడీ, రెవెన్యూ ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ రాంచందర్, సిబ్బంది రాజకీయ పార్టీ ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, మణివర్ధన్, వెంకట్రాంరెడ్డి, వెంకటయ్య, మొహమ్మద్ అబ్దుల్ తదితరులు ఉన్నారు.



- ఎనిమిది వందల ఎకరాల ఆయకట్టు చెరువు
- లక్షలాది జీవులకు ప్రాణాధారం
- మిల్లు వ్యర్థపు నీటితో చెరువులోని వేలాది చేపల మృత్యువాత
- ఆందోళనకు దిగుతున్న 14 గ్రామాల రైతులు,మత్స్యకారులు
- రంగంలోకి దిగిన జిల్లా ఇరిగేషన్‌శాఖ అధికారులు

## కాలుష్య కోరల్లో
# సుడి చెరువు..

కంపెనీ నుంచి వెలువడిన వ్యర్థపు నీరు కాలువలా చెర్వులోకి వెళ్తున్న దృశ్యం





కంపెనీ వ్యర్థపు నీటితో మృత్యువాత పడిన చేపలు

**భూత్పూర్,జూన్ 13,ప్రభాతవార్త :** కొత్తమొల్గర శివారులోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ పేపర్ మిల్లు కాలుష్యం రైతులు, మత్స్యకారుల పాలిటీ శాపంగా మారింది. ఇరవయ్యేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ మిల్లు ద్వారా వెలువడే వ్యర్థపు మురుగునీరు కాలువ ద్వారా సుమారు 800 ఎకరాలకు ఆయకట్టుగా ఉంటున్న మద్దిగట్ల సుడి చెర్వులోకి వెళ్తుండడంతో వేలాది చేపలు మృత్యువాత పడ్డాయి. ఈ చెరువు అలుగు పారితే కెఎల్ఐ కాలువకు అనుసంధానంగా మారి దాదాపు 14గ్రామాలకు వెళ్లే స్వచ్ఛమైన చెరువు నీరు.. కాలుష్యంగా మారే ప్రమాదముందని చెరువు ఆయకట్టు కింద వ్యవసాయం,చేపల పెంపకం చేపట్టిన రైతులు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమౌతున్నారు. వారం రోజులుగా వ్యర్థపు నీరు చెరువులో కలియడంతో చెరువులోని వేలాది చేపలు మృత్యువాత పడ్డాయని రైతులు,మత్స్యకారులు



కొత్తమొల్గర శివారులో వెలసిన శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్

ఆందోళన చెందుతున్నారు. తమ జీవనాధారమైన పంటపొలాలు,మత్స్యసంపదను హరిస్తున్న పేపర్ మిల్లు నుంచి వచ్చే వ్యర్థపు నీటిని, కాలుష్యాన్ని అరికట్టకపోతే పేపర్ కంపెనీ ముందు ధర్నా,రాస్తారోకో చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయం ఇరిగేషన్‌శాఖ అధికారుల వరకు వెళ్లగా బుధవారం జిల్లా ఇరిగేషన్ ఏఈ హరీశ్ హుటాహుటిన కొత్తమొల్గరకు సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ పేపర్ కంపెనీకి వెళ్లి,వ్యర్థపు నీరు ప్రవహించే కాలువను అనుసరించి పరిశీలించిన అనంతరం మిల్లు ద్వారా బయటకు వచ్చే వ్యర్థపు నీరు బయటకు విడిచిపెట్టి,పంటపొలాలు,మత్స్యసంపదను హరించే హక్కు మిల్లుకు లేదని,ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి వ్యర్థపు నీరు బయటకు రానీయకుండా తగు చర్యలు తీసుకోవాలని పేపర్ కంపెనీ మేనేజర్ వెంకటేశ్వర్లుకు సూచించారు. అక్కడకు చేరుకున్న మీడియాతో రైతులు ఈ కంపెనీ వదిలే వ్యర్థపు నీరు చెరువులో కలియడంతో తాము ఎంతో నష్టపోతున్నామని తమ బాధను వెల్లడించారు.

### ఇండస్ట్రీ వల్ల తమకు తీరని నష్టం



పేపర్ మిల్లు వెదజల్లే నీటి కాలుష్యం వల్ల తమ పంట పొలాలు దెబ్బతినడమే కాకుండా వ్యర్థపు నీరు భూముల్లోకి ఇంకి పశు పక్షాదులు,చేపలు మృత్యువాత పడుతున్నాయని సుడి చెర్వు ఆయకట్టు కింద ఉన్న పాతమొల్గర గ్రామ రైతు చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవుల ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రమాద భరితంగా ఉన్న ఈ పేపర్ మిల్లును మూయించాలని చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

*- చంద్రశేఖర్‌రెడ్డి, పాతమొల్గర గ్రామ రైతు*

### తమ పశువులకు ఆనారోగ్యం



వ్యర్థపు నీటి వల్ల కాలుష్య మేర్పడి తమ పశువులు ఆనారోగ్యం పాలవుతున్నాయని, ఇండస్ట్రీ యాజమాన్యం తగిన జాగ్రత్త చర్యలు తీసుకొనకపోతే కోర్టుకెళ్తామని మరో రైతు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్య తలెత్తినా సదరు పేపరు కంపెనీ యాజమాన్యం నిమ్మకు నీరెత్తిన చందంగా మారి కంటి తుడుపు చర్యగా తాత్కాలిక పనులు చేపడుతూ చేతులు దులిపేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

*- రైతు శ్రీనివాస్‌రెడ్డి*

### వ్యర్థపు నీటి వల్ల ప్రాణులకు హాని



పేపర్ మిల్లు వ్యర్థపు నీటి వల్ల పశువులు,చేపలు ఇతర ప్రాణులకు తీరని హాని కల్గుతోందని కప్పెట గ్రామ రైతు,మాజీ వైస్ ఎంపిపి నరేష్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు, ప్రాణులకు చేటు కల్గించే కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆందోళన దిగుతున్నామని నరేష్‌గౌడ్ హెచ్చరిస్తున్నారు.

*- మాజీ వైఎస్ ఎంపిపి, కప్పెట గ్రామ రైతు నరేష్‌గౌడ్*

### పొల్యూషన్ ట్యాంక్ నిర్మించుకోవాలి



ఇండస్ట్రీ ఏర్పాటు చేసిన తర్వాత దీని ద్వారా వెలువడే వ్యర్థాలను, నీటిని బయటకు పోనివ్వకుండా కంపెనీ లోనే పొల్యూషన్ ట్యాంక్‌నేర్పాటు చేసుకోవాల్సిన అవసరమెంతైనా ఉందని జిల్లా ఇరిగేషన్ ఏఈ హరీశ్ స్పష్టం చేశారు. కంపెనీ ద్వారా రైతులు,పశు సంపద,మత్స్య సంపదకు నష్టం వాటిల్ల కూడదని పేర్కొన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుంటే కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన తీసుకోవాల్సి వస్తుందని హరీశ్ హెచ్చరించారు.

*- ఇరిగేషన్ ఏఈ హరీశ్*

### వ్యర్థపు నీరు బయటకు రాకుండా చూస్తాం



కంపెనీ నుంచి వెలువడే వ్యర్థపు నీరు బయటకు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయమై తమ కంపెనీ ఎండీతో చర్చించి వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని ఇండస్ట్రీ మేనేజర్ వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు.

*- వెంకటేశ్వర్లు, మేనేజర్,శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీ*

# ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

### పెబ్బేరు మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన వనపర్తి శాసనసభ్యులు తుడి మెగారెడ్డి

**పెబ్బేరు, జూన్ 13 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలో శుక్రవారం వనపర్తి శాసనసభలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ మాట ఇచ్చి పేద ప్రజలను మోసం చేసిందని, నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలనలో ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇల్లు ఇవ్వడంతో పేదల కళ్ళల్లో సంతోషం చూస్తున్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పెబ్బేరు, మండలాల్లో పర్యటించి రూ.12.88కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. పెబ్బేరు మండలం యాపర్లలో బండలాగుడు పోటీలను ప్రారంభించి, అంగన్‌వాడి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయ్యవారిపల్లిలో బడిబాట, అక్షరాభ్యాసంలో పాల్గొని, గ్రామపంచాయతీ భవనానికి, లబ్ధిదారుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈర్లదిన్నె, కొత్త సుగూరు, బున్యాదిపూర్, తోమాలపల్లి, శాఖాపూర్ గ్రామాల్లో జీపీ భవనాలను ప్రారంభించి అంగన్వాడి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రంగాపురంలో హమాలీ సంఘ, పీహెచ్‌సి భవనాలను ప్రారంభించారు. పెబ్బేరు మున్సిపాలిటీలోనీ చెలిమిల్లలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. పెబ్బేరులో అమృత్ స్కీం ద్వారా చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను సకాలంలో సమకూరుస్తున్నది తమ ప్రజా ప్రభుత్వమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, క్రీడా రంగాలను బలోపేతం చేసేందుకు, గ్రామాలలో మౌళిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి, ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తుందని చెప్పారు. స్కూల్స్ రీ ఓపెనింగ్ కంటే ముందుగానే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలు చేరిపోయి, ప్రారంభంరోజే విద్యార్థులకు అందజేయడం ఇందుకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో పెబ్బేరు, వనపర్తి ఏఎంసీల ఛైర్మన్లు ప్రమోదిని రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాంరెడ్డి, రాజేష్, బ్రహ్మం చారి, మధుసూదన్ గౌడ్, రంజిత్ కుమార్, వెంకట్రాములు, శ్రీహరి రాజు, యుగంధర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కురుమూర్తి, రాజశేఖర్, వెంకటేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కస్తూరిబా గాంధీ పాఠశాలలో అదనపు గదులకు భూమి పూజ

## ప్రజలకు మెరుగైన
# సేవలు అందించాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 13 ప్రభాతవార్త:** ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ట్రేస్మా నూతన కార్యవర్గం సభ్యులకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. 2025,2028 కాలానికి మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ట్రేసా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మహబూబ్ నగర్ జిల్లా శాఖ ట్రేస్మా నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ట్రేసా కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రేస్మా అధ్యక్షులు సి.నర్సింగ్ రావు, జిల్లా కలెక్టర్ ఎఓ శంకర్, బి.శ్రీనివాసులు, బి.బాలప్రసాద్, సునీల్ కుమార్, గాయత్రి, సువర్ణ, దేవేందర్ పాల్గొన్నారు.

## డి అడిక్షన్ సెంటర్లో ఏర్పాటుకు
# దరఖాస్తుల ఆహ్వానం

### మహబూబ్‌నగర్ జిల్లా విజయేంద్ర బోయి వెల్లడి

**మహబూబ్‌నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** తెలంగాణలోని (14) జిఎపి జిల్లాలలో నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ పథకం కింద జిల్లా డీఅడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి అర్హత కలిగిన సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ, ప్రతిపాదనను భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత శాఖ (డ్రగ్స్ ప్రివెన్షన్ డివిజన్) ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్ నగర్‌తో పాటు,జయ శంకర్ భూపాల పల్లి,జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, ఆసిఫా బాద్, మంచిర్యాల, నిర్మల్ ,రాజన్న సిరిసిల్ల, సంగా రెడ్డి, సూర్యాపేట, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ పేట,హనుమకొండ జిల్లాల్లో జిల్లా డీఅడిక్షన్ సెంటర్లను ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో అత్యున్నత స్థాయి ఎన్‌సిఓఆర్‌డి కమిటీ గ్యాప్ జిల్లాల్లో కనీసం ఒక డీ అడిక్షన్ సెంటర్ అవసరాన్ని తెలియచేసిందని అన్నారు. డ్రగ్ డీ అడిక్షన్ రంగంలో కనీసం 2 సంవత్సరాల అనుభవం ఉన్న అర్హత కలిగిన ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జిఓలు)/ స్వచ్ఛంద సంస్థలు (విఓఎస్) ఇతర అర్హత కలిగిన సంస్థలు భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత శాఖ ఇ అనుధాన్ ద్వారా జూన్ 30 లోగా దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. టి.జి. యాంటీ నార్కోటిక్ బ్యూరో,(టిజిఎఎన్‌బి)తెలంగాణ ప్రభుత్వ దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సహకారంతో, రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యసనం నివారణ, పునరావాస మౌలిక సదుపాయాలలో కీలకమైన అంతరాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి, సంస్థలు తప్పనిసరిగా ఎన్ పీ ఓ దర్పన్ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలని,ఒక వేళ లేకపోతే, వారు దర్పన్ వెబ్‌సైట్‌లో హెచ్‌టిటిపిఎస్.ఎన్‌జిఓ. దర్పన్.జిఓవి.ఆర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం టిజిఎఎన్‌బి అవేర్‌నెస్ వింగ్ ఇన్‌స్పెక్టర్ (8712661735) పి. శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ (9885938488), డిఇపిడబ్ల్యుడి,ఎస్‌సి అండ్ టిజిపి వర ప్రసాద్‌లను సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

# ఇందిరా సౌర గిరి పథకం రైతులకు రాష్ట్ర స్థాయి శిక్షణ

- గిరిజన రైతులు మాస్టర్ ట్రైనర్స్‌గా నల్లమల్ల రైతులకు ఉద్యాన శిక్షణ
- రాష్ట్రానికి నల్లమల్ల ఆదర్శంగా మారాలి
- గిరిజన రైతుల ఆదాయం రెట్టింపు చేయడం లక్ష్యం
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త:** నల్లమల్ల ఇందిరా సౌర గిరి వికాసం రైతులకు రాష్ట్ర స్థాయి ఉద్యాన పరిశోధన శిక్షణా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ, నల్లమల్ల గిరిజన రైతులు ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని రాష్ట్రస్థాయి శిక్షకులుగా మారాలని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఇందిరా సౌర గిరి జల వికాస లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. ఉద్యాన పంటలపై పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన తర్వాత రాష్ట్రస్థాయిలో వారి సేవలు వినియోగించుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మే నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిరా సౌర గిరి వికాసం పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, 30 మంది లబ్ధిదారులకు ఉద్యాన పండ్ల మొక్కలు సాగు చేస్తున్న ముగ్గురు నల్లమల్ల రైతులకు రాష్ట్రస్థాయిలోని ఉద్యాన పరిశోధన కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ అందించి వారి సేవలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంగా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ చాంబర్లో ఇందిరా సౌర గిరిజల వికాస లబ్ధిదారులైన కే.రాజకుమార్, యు.లక్ష్మి, యు.అలివేలలతో కలెక్టర్ మాట్లాడారు. పాలెం కె.వి.కె, నల్లగొండ, మల్లేపల్లి ఉద్యాన శిక్షణా కేంద్రం, సంగారెడ్డి ఉద్యాన శిక్షణా, పరిశోధన కేంద్రాల్లో ఉద్యాన పంటలపై పూర్తిస్థాయి శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ వారికి తెలిపారు. శిక్షణ అనంతరం రాష్ట్రస్థాయిలో ఇందిరా సౌర గిరి జలవికాసం పథకాన్ని నల్లమల్ల ప్రాంతం నుండి రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్స్‌గా వ్యవహరించాల్సి ఉంటుందని, శిక్షణ తరగతుల్లో ఆ విధమైన నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఇందిరా గిరి వికాస లబ్ధిదారు రైతులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కెవికె పాలెం పరిశోధనా కేంద్రంలో అన్ని రకాల ఉద్యాన పంటలపై, నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి ఉద్యాన పరిశోధనా శిక్షణ కేంద్రంలో నిమ్మ, బత్తాయి పంట సాగుపై, సంగారెడ్డి జిల్లా ఉద్యాన శిక్షణ పరిశోధనా కేంద్రంలో మామిడి పంట సాగుపై పూర్తిస్థాయిలో శిక్షణ తరగతులను అందించనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకానికి నాగర్‌కర్నూల్ జిల్లా ఇందిరా సౌర గిరి జల వికాసం రైతులు రాష్ట్రస్థాయి సౌర గిరి లబ్ధిదారులకు శిక్షణా తరగతులను అందించేలా వారిని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఆదివాసి, గిరిజన రైతుల ఆర్థిక అభ్యున్నతి పొందేలా కృషి చేయాలని, ఆ విధమైన శిక్షణ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఉద్యాన పంటలతో పాటు మామిడి, అవకాడ, బత్తాయి, జీడి మామిడి, కొబ్బరితో పాటు జామ, సీతాఫలం, నిమ్మ, నేరేడు, రేగు, మునగ, గులాబీ, మల్లె వంటి పూలు, ఆయుర్వేద, సుగంధ తైల మొక్కల సాగు, మార్కెటింగ్, తదితర అంశాలపై క్షుణ్ణంగా నాగర్‌కర్నూలు జిల్లా నల్లమల్ల ప్రాంతానికి చెందిన ముగ్గురు ఇందిరా సౌర గిరి రైతులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గిరిజన రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, బీడు భూములకు నూతన జీవం పోసే మార్గంగానే ఎన్నో రకాల పండ్ల తోటల సాగుకు నాంది పలకడం జరిగిందని, శిక్షణ కేంద్రంలో ఉద్యాన శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని, గిరిజనుల భూముల్లో అనువైన పండ్ల తోటల పంటల సాగుకు రాష్ట్రవ్యాప్తంగా కృషి చేయాలని, ఇందిరా సౌర గిరి వికాస రైతులందరి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా మీ కృషి ఉండాలని, అప్పుడే ఈ నల్లమల్ల ప్రాంతానికి దేశస్థాయిలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని కలెక్టర్ సూచించారు. నల్లమల ప్రాంత రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడం లక్ష్యంగా ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం కింద కృషి చేయాలని, ఈ పథకం విజయవంతంగా అమలు చేయడం ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే కాకుండా, నల్లమల ప్రాంతానికి దేశ స్థాయిలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పథకం కేవలం ఆర్థిక ప్రగతిని మాత్రమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని నొక్కి చెప్పారు. సౌర శక్తి వినియోగం ద్వారా నల్లమల అటవీ ప్రాంతంలో విద్యుత్ అవసరాలను తీర్చడం, తద్వారా అటవీ సంపదకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడటం ఇందిరా సౌర గిరి వికాస పథకంలోని కీలక అంశమని తెలిపారు. నల్లమల ప్రాంతంలోని రైతులకు ఇందిరా సౌర గిరి జల వికాసం ఒక నూతన ఆశాకిరణంగా నిలుస్తుందని, వారి జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువస్తుందని ఆయన అన్నారు. అంతిమంగా, ఈ సమగ్ర కృషి నల్లమల ప్రాంతాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం ఉన్నారు.



ఇందిరా సౌర గిరి జల వికాస లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## సాగునీరు అభివృద్ధి ప్రధాత

## స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి

**అమరచింత జూన్ 13,ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగునీరు తోపాటు త్రాగునీరు ఇచ్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ కొత్తకోట దయాకర్ రెడ్డి అభివృద్ధి ప్రదాతగా నిలిచారని మాజీ ఎంపిటిసి, తిరుమలేష్ అన్నారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొత్తకోట దయాకర్ రెడ్డి రెండవ వర్ధంతి సందర్భంగా బస్టాండులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి తిరుమలేష్ మాట్లాడుతూ, స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి హాయంలో అమరచింత నియోజకవర్గం ఉన్నప్పుడు అమరచింత ఎత్తిపోతల పథకాన్ని సాధించి జూరాల ప్రాజెక్టు నుండి వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కిందని ఆయన అన్నారు. కొత్తకోట దయాకర్ రెడ్డి హాయంలో బడుగు బలహీన వర్గాల తో పాటు మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభుదాస్, పెద్ద బాలరాజ్, జానిస్ట్, దేవరాజ్, యోబు, ఆంజనేయులు, బన్నుల మహమూద్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొత్తకోట దయాకర్ రెడ్డి వర్ధంతి

## ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలు ఆపాలి

**విద్యార్థి సంఘాల నేతల వెల్లడి**

**ఆత్మకూర్ జూన్13,ప్రభాతవార్త;** రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్ట నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యం పుస్తకాలు, నూర్పుస్తకాలు అమ్మకాన్ని తక్షణమే నిలిపివేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, డివైఎఫ్ఐ, సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు శుక్రవారం రోజు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని మండల విద్యాధికారి బాలరాజ్ గారికి వినతి పత్రం సమర్పించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు నోట్ పుస్తకాల పేరిట అధిక ఫీజులను వసూలు చేస్తూ విద్యాహక్కు చట్టాన్ని కాలరాస్తున్నప్పటికీ అధికారులు చర్యలు చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వస్తువులు కల్పిస్తున్నామని ప్రగల్బాలు పలుకుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యపడడం లేదని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలను తక్షణమే నిలిపివేసి అధిక ఫీజులను అరికట్టాలని లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముట్టడికి ఏర్పాట్లు చేయనున్నట్లుగా వారు తెలిపారు. మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేసిన వారిలో విద్యార్థి సంఘాల నాయకులు వెంకటేష్, కుతుబ్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

## నర్సింగాపూర్‌లో సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం

**- పభుత్వ బడుల్లో ఏఐ కంప్యూటర్ ఆధారిత విద్య**

**- పిల్లలకు పార్యపుస్తకాలు,ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం**

**భూత్పూర్,జూన్ 13,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు నర్సింగాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దస్తులు,పలకలు పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ఆనందమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఏఐ కంప్యూటర్ ఆధారిత విద్య అందుతుందన్నారు.గ్రామానికి చెందిన మల్లేష్ అనే యువకుడు పిల్లలకు నోటు పుస్తకాలు,పెన్నులు,పలకలు ఉదారంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల హెచ్ఎం శశిధర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ల్లో పిల్లలకు గుణాత్మక విద్యతో పాటు పౌష్టికారం అందుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడ శేఖర్,ఏపీసీ చైర్మన్ సంధ్య,అంగన్వాడీ టీచర్ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.


నర్సింగాపూర్‌లో విద్యార్థులకు పార్యపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనందమ్మ

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**కల్వకుర్తి, జూన్ 13 ప్రభాతవార్త:**రైతులు తమ భూముల సమస్యలను పరిష్కరించుకోవడానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనునాయక్ అన్నారు. కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామంలో తహశీల్దార్ ఇబ్రహీం అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్డీఓ శ్రీనునాయక్ ముఖ్య అతిథిగా హాజరై రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులందరూ ఇట్టి రెవెన్యూ సదస్సులలో వారి వారి భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని అట్టి వాటిని విచారించి పరిష్కారం చేస్తారని తెలిపారు. రెవె న్యూ సదస్సులకు తర్నికల్ గ్రామంలో 87, కల్వకుర్తి లో 49 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ ఇబ్రహీం తెలిపారు. ఇట్టి సదస్సులో తహశీల్దార్ ఇబ్రహీం, డి.టీ.లు అనిత, రాఘవేంద్ర, ఆర్ఐ లు రవూఫ్, రోహిత్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నవీన్, శేఖర్, విష్ణు, లక్ష్మయ్య, జగదీష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనునాయక్

## ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

**ఉప్పునుంతల,జూన్ 13 ప్రభాతవార్త :**మండలకేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాలలో ఆపాఠశాల హెచ్ఎం ఎం. శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాలు అనేవి ఏ భాషకైనా ప్రాథమిక మైనవని, అక్షరాలతో పదాలు,వాక్యాలు,పేరాలు అందుకే విద్యార్థులకు అక్షరాలను, వాటి శబ్దాలను అర్థవంతమైన కృత్యాధార పద్ధతిలో ఆటపాటలతో నేర్పిస్తున్నామని, చదవడం ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుందని రాయడం ద్వారా భావవ్యక్తీకరణ చేరవచ్చని ఆయన అన్నారు. సామూహిక అక్షర భ్యాసంలో ఆ పాఠశాల హెచ్ఎం ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, చందన, సంగిత, సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి పాత్కుల సైదమ్మ రామచంద్రయ్య, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోడమోని భాస్కర్, అంగన్వాడీ కార్యకర్తలు పద్మ, విద్యార్థుల తల్లిదండ్రులు బాజ కోటేష్, మస్కూరి మల్లేష్, పాతుకుల కొండల్, సున్నం కురుమయ్య విద్యార్థులు పాల్గొన్నారు.


ఉప్పునుంతల బాలుర పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

## దయాకర్ రెడ్డి సేవలు మరువలేనివి నేతల వెల్లడి

**ఆత్మకూర్ జూన్ 13, ప్రభాతవార్త;** అమరచింత మాజీ శాసనసభ్యులు దివంగత నాయకులు కొత్తకోట దయాకర్‌రెడ్డి సేవలు మరువలేనివని ఆత్మకూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వెల్లడించారు.శుక్రవారం రోజు దయాకర్‌రెడ్డి రెండవ వర్ధంతి పురస్కరించుకొని ఆత్మకూర్ పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర దయాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరచింత నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత దయాకర్ రెడ్డికే దక్కుతుందని ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్న మహానుభావుడని వారు పేర్కొన్నారు. అంతకుముందుగా ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దయాకర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టెలమండి రాములు, ఎస్.టి.డి శ్రీనివాసులు, గాలి పంపు శ్రీనివాసులు, తిరుపతయ్య గౌడ్, పిన్నంచర్ల వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోళ్లలో చారిత్రాత్మకం

- జిల్లాలో 28,705 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్ళు
- రైతుల ఖాతాల్లో నిర్ణిత సమయంలో నేరుగా రూ.335 కోట్లు జమ
- జిల్లా చరిత్రలో ప్రథమంగా భారీ స్థాయిలో వరి కొనుగోలు
- 232 కొనుగోలు కేంద్రాలు, 142 మిల్లులకు ధాన్యం తరలింపు
- అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- యాసంగిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రైతుల అభ్యున్నతి, సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు చేరవేయడంతో పాటు రైతుల కోసం నిరంతరం జిల్లా అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తోందని ఈ విషయంలో అన్నదాతలకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో తనతో పాటు అధికారులు పని చేశారని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో 1 లక్షా 60 వేల ఎకరాల్లో వరి పంట సాగు జరిగిందని, వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి అయ్యిందని, రైతుల అవసరాలకు, విత్తనాల వినియోగానికి అవసరమైన మేరకు వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లాలో అనుకూలమైన వాతావరణం, సారవంతమైన నేలలు మరియు నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో వరి పంటల సాగు ఈ సంవత్సరం గణనీయంగా పెరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రప్రథమంగా పెద్ద మొత్తంలో వరి ధాన్యం నేరుగా రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగిందని, అదే సమయంలో ధాన్యం డబ్బులను కూడా వారి ఖాతాల్లో జమ చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. అలాగే మున్ముందు రోజుల్లో కూడా అధికారులు, రైతుల సహకారం, సమన్వయంతో జిల్లాలో రైతులకు అన్ని రకాలుగా సేవలందించడం జరుగుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లాలో 232 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాల నుండి నేరుగా జిల్లాలో ఉన్న 142 మిల్లులకు తరలింపు ప్రక్రియను పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇంకా 10వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉందని, రానున్న 2,3 రోజుల్లోనే కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. యాసంగిలో వర్షాలు కురిసినప్పటికీ అందుకు ప్రత్యామ్నాయం ధాన్యం తడవకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు చివరి గింజ వరకు వడ్లను కొనుగోలు చేసి రైతులకు గతంలో కంటే ముందుగానే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని స్పష్టం చేశారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభమైనప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలను తాను సైతం ఆకస్మికంగా తనిఖీలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని ఈ విషయంలో రైతులు కూడా తమ తోడ్పాటు నందించారని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. అన్నదాతల కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించిందన్నారు.


ధాన్యం కొనుగోలు చేసిన వివరాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఈ విషయంలో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు క్షేత్రస్థాయిలో స్వయంగా తాను పర్యటించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరుగుతోందని కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. జిల్లాలో తాను పర్యటిస్తున్న సమయంలో రైతులు సైతం తమకు కొన్ని సలహాలు చేయగా వాటిని వెంటనే అమలు చేయడంతో పాటు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నేటి వరకు 28,705 మంది రైతుల నుండి 1 లక్ష 71 వేల 694 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, అందులో 26 వేల 314 మంది రైతులకు రూ. 335 కోట్లు ధాన్యం డబ్బులను నేరుగా నిర్దేశిత సమయంలో రైతుల ఖాతాలో జమ చేసినట్లు, అందులో మరో 239 మంది రైతులకు చెల్లించాల్సి న రూ.60 కోట్లు కూడా త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లా చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రప్రథమంగా పెద్ద మొత్తంలో వరి ధాన్యం నేరుగా రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగిందని, అదే సమయంలో ధాన్యం డబ్బులను కూడా వారి ఖాతాల్లో జమ చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ వివరించారు. అలాగే మున్ముందు రోజుల్లో కూడా అధికారులు, రైతుల సహకారం, సమన్వయంతో జిల్లాలో రైతులకు అన్ని రకాలుగా సేవలందించడం జరుగుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్ళు చేయడం జరుగుతుందని ఈ విషయంలో రైతులు ఏమాత్రం అధైర్యపడరాదని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.

## ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పెంచే బాధ్యత అధ్యాపకులదే

**ఇంటర్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ వెల్లడి**

**ఆత్మకూర్ జూన్ 13, ప్రభాతవార్త ;** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పెంచే బాధ్యత ఆయా కళాశాలలో పని చేసే అధ్యాపకుల దేనని ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ కళాశాలను సందర్శించి విద్యార్థుల ప్రవేశాల పెరుగుదలకు సంబంధించి అధ్యాపక బృందానికి తగు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో వసతులు సమకూరుస్తున్నప్పటికీ ప్రవేశాల సంఖ్య పెరగకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు భరోసా కల్పించి ప్రభుత్వ కళాశాలలోనే విద్యనభ్యసించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి కనీసం ఈ విద్యా సంవత్సరం 30 ప్రవేశాలను పెంచే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఆత్మకూర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులకు కనీస సౌకర్యాలను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందుగా కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించి అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భాగ్య వర్ధన్ రెడ్డి, సీనియర్ ఆధ్యాపకులు టీజే విశ్వేశ్వర్, కళాశాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.


కళాశాల పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

**మునుగుబాటుకు గురవుతున్న భూములకు**

## మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తాం

**ఖిల్లా ఘనపురం, జూన్ 13, ప్రభాతవార్త;** ఘనప సముద్రం చెరువులో మునుగుబాటుకు గురవుతున్న భూములకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందజేస్తామని వనపర్తి ఆర్డిఓ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక ఆవరణలో ఘనవసముద్రంలో మునుగు వాటుకు గురవుతున్న రైతులతో పాటు ఇరిగేషన్ అధికారులు సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని కోల్పోతున్న రైతులకు ఎకరాకు 11 నుండి 12 లక్షల రూపాయల వరకు నష్టపరిహారం అందజేస్తామని వెల్లడించారు. ములుగు బాటకు గురవుతున్న రైతులు కొంత భూమిని కోల్పోతున్నప్పటికీ అనేకమంది రైతులకు సాగునీరు అంది సమృద్ధిగా పంటలు పండడానికి సహాయపడిన వారు అవుతారని రైతులకు విజ్ఞప్తి చేశారు. టి రిజర్వాయర్ నిర్మాణం కోసం రైతులు పెద్ద మనసు చేసుకొని సహకరించాలని కోరారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం 603.46 ఎకరాల్లో 991 మంది రైతులు ఉండగా ఇప్పటికే 251 రైతులు భూమి ఇచ్చేందుకు అంగీకారం తెలిపి అవార్డులు తీసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన 740 మంది రైతులు సైతం అంగీకరిస్తే ఘనప సముద్రం రిజర్వాయర్ పూర్తి అవుతుందని తద్వారా 52 ఎకరాలకు సాగునీరు అందించవచ్చునిచెప్పారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తవుతే ఘనపురం మండలం తో పాటు నిజాలాపూర్ మూసాపేట మహమ్మద్ హుస్సేన్ పల్లి గ్రామ రైతులకు సాగునీరు అందుతుందని వివరించారు. ఈ విషయమై రైతులు ఆలోచించుకొని ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ నరేందర్ రెడ్డి, సర్వేయర్ రైతులు పాల్గొన్నారు.


ముంపు రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో సుబ్రహ్మణ్యం

## ప్రైవేటు పాఠశాలల ఫీజులు నియంత్రించాలి

**జిల్లా కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేత**

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంతోపాటు మరికల్, కోస్గి ,మద్దూర్, మక్తల్ తదితర పట్టణాలలో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం తమ ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు బాలప్ప, ఉడ్మల్ గిద్ద గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం కలెక్టర్‌రేట్ ఏవో జయసుధకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలలకు సరిపడా గదులు, మైదానం కనీస వసతులు కొరవడినవని తెలిపారు. అధిక బస్సు ఛార్జ్ వసులు చేస్తున్నారన్నారు. టెక్స్ బుక్స్, యూనిఫామ్స్, షూస్ టై బెల్టు ప్రైవేట్ అందిస్తూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్నాయని ఇలాంటి పాఠశాలలపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కొన్ని పాఠశాలలను యజమానులు విద్యాశాఖ అనుమతి లేకుండా నడుపుతున్నారని పాఠశాలల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శివకుమార్, దామోదర్ గౌడ్ తదితరులు ఉన్నారు.


వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

**మానవపాడు, జూన్ 13 ప్రభాతవార్త :** రైతుల సమస్యలు పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి రెవెన్యూ చట్టం తీసుకొచ్చిందని తాహసిల్దార్ జోషి శ్రీనివాస శర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని బోరవెల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే గతంలో పరిష్కారం కానీ భూసమస్యలపై రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామంలో 81 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


దరఖాస్తుల స్వీకరిస్తున్న తాసిల్దార్, రెవెన్యూ సిబ్బంది

## సామూహిక అక్షరాభ్యాసం


మునగాలలో చిన్నారులకు పలకలను పంపిణీ చేసిన ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు

**ఇటిక్యాల,జూన్ 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మునగాల, తర్ల, ఉదండాపురం గ్రామాలలో శుక్రవారం పాఠశాలలో చేరిన చిన్నారులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పలకలను పంపిణీ చేసి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ప్రారంభం కావడంతో అంగన్‌వాడి కేంద్రాల నుండి ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతిలోకి చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిం చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాభ్యాసం చేయించిన ఎంఈఓ

**వెల్దండ, జూన్ 13 ప్రభాతవార్త:**తల్లిదండ్రులు మన ఊరిలోని మన బడికే పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. మండల పరిధిలోని మూతపడిన కంటోనిపల్లి ప్రాథమిక పాఠశాల తుమ్మలకుంట తండా, ఎర్రవెల్లి తండా పాఠశాలలను ఎంఈఓ చంద్రుడు పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గ్రామ ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. అలాగే పెద్దాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే అక్షరాభ్యాసంను చేయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం అన్ని విధాల కృషి చేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

**భూ సమస్యల పరిష్కార కోసమే**

## రెవెన్యూ సదస్సులు : వనపర్తి ఆర్డిఓ

**ఖిల్లా గణపురం, జూన్ 13, ప్రభాతవార్త;** భూ సమస్యల కోసమే రెవెన్యూ సంస్థలను ఏర్పాటు చేశామని వనపర్తి ఆర్డిఓ సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో భూ సమస్యలకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని వీటన్నిటికీ పరిష్కారం ఉందని రెవెన్యూ సదస్సులో ఆధారాలతో అన్నింటికీ దరఖాస్తులు సమర్పించుకోవాలని ఆయన అన్నారు. ఈరోజు జరుగుతున్న రెవెన్యూ సదస్సులలో అప్పారెడ్డిపల్లి గ్రామంలో ఆర్డిఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులలో

## ప్రభుత్వ భూములకు దరఖాస్తులు

**ఖిల్లా గణపురం. జూన్ 13, ప్రభాతవార్త:** మల్కిమీయంపల్లి రెవెన్యూ సదస్సులలో భాగంగా రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. మలికి మీ అను పల్లి గ్రామంలో ఈరోజు ప్రత్యేకంగా రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించారు. గ్రామంలో పలు సమస్యలతో పాటు, ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న రైతులు పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వ భూములలో సాగు చేస్తున్న రైతులను గుర్తించి, వారికి పట్టా చేసి ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో పవన్ ఓం ప్రకాష్ భాగ్యలక్ష్మి ౖ నాగలక్ష్మి ౖ. పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

**మక్తల్ టౌన్, జూన్ 13ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బడిబాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమము ఎంపియుపిఎస్ రుద్ర సముద్రము పాఠశాలలో మండల విద్యాధికారి ఎంఈఓ అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చిన్నారి విద్యార్థులతో చేయించడం జరిగినది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు ఆంజనేయులు రాంకిరణ్, వరుణ్ కుమార్, దివ్య జ్యోతి, మంజులత, ప్రమీల, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, సర్పంచ్, అంగన్వాడీ టీచర్స్, ప్రముఖులు అందరూ యువకులు సంఘనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ

## గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**శ్రీరంగాపూర్, జూన్ 13 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల్ సేరిపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ గృహప్రవేశమును శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి డిసిసి ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, చీర్ల నాగరాజు, మాజీ సర్పంచ్ బంగారు సునీత రాజశేఖర్, చీర్ల వెంకటేష్ సాగర్, బీరం రాజశేఖర్ రెడ్డి, బంగారు రవి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమన్న, ఈశ్వరయ్య, ఉప సర్పంచ్ బంగారు ఈశ్వరయ్య, జీఎన్ వెంకటయ్య, గోవిందు, పి.బాలయ్య, దాసరి గోకరయ్య, బంగారి రాముడు, గట్టయ్య, హేమంత్ కుమార్, ఎంపీడీవో రవి నారాయణ, పంచాయతీ కార్యదర్శి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మిక చట్టం కింద కేసు నమోదు

**భూత్పూర్,జూన్ 13,ప్రభాతవార్త:**బాలకార్మిక చట్టం కింద భూత్పూర్‌లో బాలకార్మికనిర్మూలన రెస్క్యూటీం శుక్రవారం 14ఏళ్లు నిండని బాలుని అక్రమంగా పని చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసి చట్టపరమైన తీసుకోవాలని స్పెషల్ డ్రైవ్ రెస్క్యూ టీం ఇంచార్జి ఎండి అంజాద్ భూత్పూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.వివరాల్లోకి వెళితే భూత్పూర్ పట్టణ కేంద్రంలో మహబూబ్‌నగర్‌రోడ్‌లో ఉన్న శ్రీరామలింగేశ్వర బైక్ పాయింట్‌లో 13సంవత్సరాల 5నెలల బాలుడు విస్లావత్ సిద్ధూతో బైక్ రిపేర్ పనులు చేయిస్తున్న బైక్ పాయింట్ యజమాని పి రమేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.బాలకార్మిక నిర్మూలన రెస్క్యూ టీం ఇంచార్జీ ఎండి అంజాద్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు భూత్పూర్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్,ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. రెస్క్యూ టీంలో సభ్యులుగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సర్కిల్-1 మొహ్మద్ అతహజ్,మహిళా ఏఎస్సై సక్రి,పీసీ నర్సింహులు, సోషల్ వర్కర్ రెహమా తదితరులున్నట్లు ఎస్సై తెలిపారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలి :డిప్యూటి తహసీల్దార్

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని డిప్యూటీ తాసిల్దార్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని భూభారతి సదస్సుల ద్వారా భూ సమస్యలు భూమి సమస్యలు ప్రతి ఒక్కరు తమ రెవెన్యూ బృందానికి వివరించాలని అన్నారు. ఈ రోజు కోటకొండ గ్రామంలో రైతులు కూడా గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాటి రైతులందరూ ఈ రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్ రావు కోటకొండ మాజీ సర్పంచ్ జయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, ప్రవీణ్ కుమార్, అనిల్ కుమార్, కె. రాజు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

## ఎట్టకేలకు తడిసిన ధాన్యాన్ని లారీలలో లోడింగ్

**సకాలంలో లారీలను పంపి ఉంటే ధాన్యం బస్తాలు తడిసేవి కాదు రైతులు**

**నవాబుపేట, జూన్ 13 ప్రభాతవార్త :** ఎట్టకేలకు అధికారులు స్పందించి లారీలను పంపి తడిసిన ధాన్యాన్ని లోడ్ చేసి ధాన్యాన్ని అధికారులు సేకరించారు. మండల పరిధిలోని దొడ్డిపల్లి గ్రామంలో నిన్న వర్షానికి గన్ని బ్యాగుల్లో నింపిన ధాన్యాన్ని లారీలు సకాలంలో రాలేక అధికారుల నిర్లక్ష్యంతో తడిసిన ధాన్యాన్ని ఎట్టకేలకు సేకరించారు. పలువురు రైతులు సంబంధిత సిబ్బంది సకాలంలో లారీలలో ధాన్యం లోడ్ చేసి రైస్ మిల్లులకు రవాణా చేసి ఉంటే తమ ధాన్యం వానకు తడిసిపోయి ఉండేది కాదని ధాన్యం కాంటాలు వేయడానికి, లారీలు పంపడానికి, లారీలలో లోడ్ చేయడానికి సంబంధిత సిబ్బంది ఒకరు డబ్బు అడిగారని, అతడు అడిగిన వెంటనే డబ్బు పంపకపోవడం వల్లే ధాన్యం లోడ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని రైతులు కొత్త కాపు యాదిరెడ్డి, వల్లూరు లక్ష్మయ్య, పిచ్చకుంట్ల రాములు తదితరులు ఆరోపించారు.



ధాన్యం బస్తాలను లారీలలో తరలిస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ పార్టీలోకి ఆర్సిపూర్ నాయకుల చేరికలు

**నవాబుపేట, జూన్ 13 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలోకి ఆర్సిపూర్ గ్రామానికి చెందిన నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల పరిధిలోని రేకుల చౌడపూర్ గ్రామాలనికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు జడ్చర్ల లోని క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, మాజీ డిసిసి అధికార ప్రతినిధి జనంపల్లి దుష్యంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామచంద్రయ్య, యువజన అధ్యక్షులు నీలకంఠం, శంకర్ నాయక్, ఆనంద్, కొల్లి నరసింహులు, చిర్ప సత్యం,ఎరుకల రాము, సంతోష్ నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

## రాష్ట మంత్రిని, శాసనమండలి వైస్ ఛైర్మన్‌ను కలిసిన ముదిరాజ్ నాయకులు

**జిల్లా ముదిరాజ్ సన్మాన సభకు ఆహ్వానం**

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో శుక్రవారం నారాయణపేట జిల్లా ముదిరాజ్ నాయకులు నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన సేవల మంత్రి డా. వాకిటి శ్రీహరిని వారి క్యాంపు కార్యాలయం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే ముదిరాజ్ సన్మాన సభకు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. అలాగే శాసనమండలి వైస్ ఛైర్మన్ బండ ప్రకా ష్‌ని వారి కార్యాలయంలో మర్యా దపూర్వకంగా కలవడం కలిసి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజు, దామరగిద్ద పిఎసిఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఎ. కాంత్ కుమార్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోనంగేరి హనుమంతు, మరికల్ మత్స్యశాఖ అధ్యక్షులు కానుగంటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వైస్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

## గిరిజన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**బిజినేపల్లి,జూన్ 13 ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రకుంట తండా ఉడుకులకుంట తండా లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనల స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ నళిని, కళ్యాణి తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చు తగ్గించుకోవడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, సాగునీటిని ఆదా చేయాలని భావితరాలకు అందించాలని, పంట మార్పిడి పాటించాలని సుస్థిర ఆదాయాన్ని పొందాలని అన్నదాతలకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి నీతి రెడ్డి మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు ఎరువులకు రసీదులను భద్రపరచుకోవాలని కష్ట కాలంలో నష్టపరిహారాన్ని పొందాలన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు వంశీ నాయక్, గోపాల్ కృష్ణ, ఎం. కృష్ణ లాలు, బిఖ్య, చంద్రు,బాలు, అంజి సీతమ్మ, మంగ్లీ, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.



రైతు ముంగిట్లో కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ,శాస్త్రవేత్తలు

## పుటాన్‌దొడ్డి రెవెన్యూ సదస్సులో 16 దరఖాస్తులు

**ఇటిక్యాల,జూన్ 13 ప్రభాతవార్త :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భాగంగా శుక్రవారం 9వరోజు మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామ రైతు వేదికలో తహసిల్దార్ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 16 మంది రైతులు వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తహసిల్దార్ నరేష్ తెలిపారు. ఈనెల 5వ తేదీ నుండి ప్రారంభమైన రెవెన్యూసదస్సు శుక్రవారం నాటికి 9రెవెన్యూ గ్రామాలలో కొనసాగిందని ఇంకా 2 రెవెన్యూ గ్రామాలలో కొనసాగాల్సి ఉండగా 16వ తేదీ సాసనూల్ 17వ తేదీ కారపాకుల రెవెన్యూ గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాహసిల్దార్ కోరారు.రెవెన్యూసదస్సులో సీనియర్ అసిస్టెంట్ నరేష్. ఆర్ఐలు షంషీర్, శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్లు శోభ, రాజేశ్వరి, కంప్యూటర్ ఆపరేటర్ రాంబాబు, మేఘన తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో రైతుతో మాట్లాడుతున్న తహసిల్దార్

# భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం

**ఉప్పునుంతల, జూన్ 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నిర్వహిస్తున్న భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందని తహసీల్దార్ ప్రమీల పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం లో ఏర్పాటుచేసిన భూభారతి సదస్సులో తహసీల్దార్ ప్రమీల మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూభారతి చట్టంను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏదైనా సమస్య ఉంటే నేరుగా అర్జీల ద్వారా విన్నవించుకుని పరిష్కారానికి చొరవ చూపాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో అన్ని రెవెన్యూ సదస్సులో భారీ సంఖ్యలో అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి భూభారతి చట్టం కింద వాటి సమస్య పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. అదేవిధంగా మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి చట్టం 2025 అమలుపై నిర్వహిస్తున్న సదస్సుకు ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పిస్తూ భూ సమస్యలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఎంతో దోదపడుతున్నాయని, రైతులు తమ సమస్యలను సదస్సులో విన్నవించు కుంటే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే పరిష్కరించడానికి ఎంతో వీలుంటుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులకు కేవలం భూ సమస్యలు మాత్రమే పరిష్కరించే మార్గం ఉంటుందని కొంతమంది వ్యక్తిగతంగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని, గ్రామస్థాయిలో జరిగే పరిణామాలకు భూ భారతి చట్టం అమలుకు సంబంధం ఉండాలని కేవలం భూ సమస్యలు మాత్రమే సదస్సులో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ వివరించారు. అయ్యవారిపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ శాఖలో వివిధ సమస్యలపై 17 మంది రైతులు దరఖాస్తులు పెట్టుకున్నట్లు తహసీల్దార్ ప్రమీల తెలిపారు. దాసర్లపల్లిలో 51 మంది రైతుల వివిధ సమస్యలపై అర్జీల ద్వారా విన్నవించు కున్నార ని ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ పేర్కొన్నారు. ఈ సదస్సులకు తహసీల్దార్ ప్రమీల,ఉప తహసీల్దార్ పరుష్ నాయక్, సీనియర్ అసిస్టెంట్ బలరాం నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, సిబ్బంది ఆదిత్య ,శంకర్, శివ , సాయి, స్వప్న, రమణమ్మ, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఊర్మిళ యాదిరెడ్డి తోపాటు అయ్యవారిపల్లి గ్రామ రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

**16న మండలంలో...** భూభారతి చట్టం 2025 అమలుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం మండలంలోని పిరట్వాన్ పల్లి, లక్ష్మాపూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని, సకాలంలో రైతులు సదస్సులకు హాజరై తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలని తహసీల్దార్ ప్రమీల కోరారు.

### భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అయ్యవారిపల్లి లో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల గురించి దరఖాస్తుల స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రమీల




దాసర్లపల్లి లో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఉప తహసీల్దార్ పరుష్ నాయక్

## బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు

- ఆపరేషన్ ముష్కాన్, స్మైల్‌లతో కఠిన తనిఖీలు
- బాల కార్మికుల సమాచారం కోసం 1098, 112కు కాల్ చేయండి
- చట్టవిరుద్ధంగా బాల కార్మికులను వినియోగిస్తే జైలు శిక్ష,
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్కడైనా బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కార్మిక శాఖ, జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖా ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ గోడ పత్రికను శుక్రవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో జిల్లాలో ఎక్కడా బాల కార్మికులు ఉండకూడదని, హోటళ్లు, వ్యాపార సంస్థలు, వ్యవసాయ పొలాలు, గృహాలలో బాలురు పని చేస్తూ కనిపిస్తే స్పెషల్ ఆపరేషన్‌ల ద్వారా గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకు తరచుగా ఆపరేషన్ ముష్కాన్, ఆపరేషన్ స్మైల్ తో పాటు లేబర్ ఆఫీసర్ ద్వారా జిల్లాలో పటిష్టంగా పర్యవేక్షణా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు పిల్లలను పనిలో చేర్చుకుంటే సెక్షన్ (3 ) పి అండ్ ఆర్ అమెండ్మెంట్ యాక్టు 2016 ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. 14 సంవత్సరాల వయస్సు కంటే తక్కువ వయస్సు పిల్లలను పనిలో పెట్టుకుంటే రూ.50 వేల జరిమానా లేదా జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. బాల కార్మికులు కనిపిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1098/112 కు ఫోన్ చేసి తెలుపాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రాజేశ్వరి, జిల్లా లేబర్ ఆఫీసర్ రాజ్ కుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ రావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలం గౌడ్, సఖి కోఆర్డినేటర్ సునీత, బాలల సమితి కోఆర్డినేటర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## నేడు డైల్ యువర్ డిఎం కార్యక్రమం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త:**నారాయ ణపేట పట్టణ, కోస్గి పరిసర ప్రాంతాల ప్రజలకు కోసం నేడు ఉదయం 11 గ.ల నుండి 12 గం.ల వరకు డయల్ యువర్ డియం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నారాయణపేట డిపో మేనేజర్ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఫోన్ నెంబర్ 7382826293కు ఫోన్ చేసి తగు సలహాలు మరియు సూచనలను తెలియజేయాలని కోరారు.



డిఓ మేనేజర్ లావణ్య

## పేటలో నేడు విద్యుత్ అంతరాయం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలో 33/11 కె.వి. ఉప విద్యుత్ కేంద్రంలో నేడు ఫీడర్స్ పునరుద్ధరణ పనుల కారణంగా ఉదయం 8 గం.ల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ. మహేష్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు, నారాయణపేట విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు. ఈ ఉప విద్యుత్ కేంద్రంలో ఉన్న ఫీడర్స్ వైజేఆర్ ఫీడర్, చిల్డ్రన్ ఆసుపత్రి, సివిల్ 1, సివిల్ 2, జిలాల్ పూర్, సత్యసాయి ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉందని వీటి పరిధిలో ఉన్న కాలనీల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. అలాగే నారాయణపేట మండలం సింగారం ఫీడర్ పంప్ హౌస్ ఫీడర్ సైతం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

## విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

**బిజినేపల్లి జూన్ 13 ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కాకుండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కథలప్ప మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్య పుస్తకాలు,యూనిఫార్మ్, మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, సెక్రటరీ దివ్య, కల్లు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు రామకృష్ణ, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, అంగన్వాడీ టీచర్లు శశికళ, ఆయా సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

## బోరవెల్లి స్కూల్‌లో అక్షరాభ్యాసం

**మానవపాడు,జూన్13 ప్రభాతవార్త:**మండల పరిధిలో బోరవెల్లి గ్రామంలోని యుపిఎస్ పాఠశాలను ఎంఈఓ శివప్రసాద్ శుక్రవారం సందర్శించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో కలిసి చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు బుక్స్, నోట్ బుక్స్ యూనిఫారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అక్షరాభ్యాసం



విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

**నారాయణపేటటౌన్,జూన్ 13 ప్రభాతవార్త :** దామరగిద్ద కేంద్ర ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఒకటవ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులచే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చందు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పించిందన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ాల సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

### లోక్ అదాలత్ ద్వార సత్వర న్యాయం

## రాజీ మార్గమే... రాజ మార్గం

- ఈ నెల 14వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు, రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారు
- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్, జూన్ 13 ప్రభాతవార్త :** వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి. ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే అప్పుడే సమసిపోతాయని, జిల్లాలో వివిధ రకాల రాజీపడదగు కేసులు కక్షిదారులకు రాజమార్గమని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 14 వరకు వనపర్తి జిల్లా కోర్టుల లో "నేషనల్ లోక్ అదాలత్" సందర్భంగా కక్షిదారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మీకు తెలిసిన వాళ్లపై ఏమైనా కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకొని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసులను పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుందని అన్నారు. యాక్సిడెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులు, వివాహబంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఇతర రాజీ పడదగు కేసులలో ఈ నేషనల్ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని క్లోజ్ చేసుకోవచ్చని ఎస్పీ అన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని కేసులలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికోసం ఫిర్యాదుదారుడు నేరస్తులు అందరూ తమ యొక్క ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత కోర్ట్ ప్రదేశంలో హాజరుకావాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా బాధితులకు మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.



జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ (ఫైల్)

## ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసిన అధ్యాపకులు

**పెబ్బేరు,జూన్13 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామంలో జిల్లా ఉన్నత పాఠశాలకు సంబంధించిన 25 మంది విద్యార్థులు 10వ తరగతి పాస్ కావడం జరిగింది. పాసైన విద్యార్థులలో 16 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ గ్రూపులలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపులలో అడ్మిషన్లు త్వరగా పొందడం జరిగింది. తమ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రంగాపురం పాఠశాల విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకోవడానికి ప్రోత్సహించిన ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు,ఉపాధ్యాయులను పెబ్బేర్ ప్రభుత్వజూనియర్ కళాశాల అధ్యాపకులు ఎంతో సంతోషాన్ని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, రంగాపురం పాఠశాల ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞత భావంతో మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానో ఉపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ మీరు మేము మనమందరం ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్నాము తప్పకుండా ప్రభుత్వసెక్టార్‌లో నడిచే విద్యవ్యవస్థలను మనమందరం కలిసి బలోపేతం చేద్దాం అన్నారు. మా పాఠశాల విద్యార్థులు తప్పకుండా మీకళాశాలలో అడ్మిషన్ తీసుకోవడానికి మా సహకారం ఎల్లప్పుడు ఉంటుందని రంగాపురం పాఠశాల ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కృష్ణయ్య నవీన్, రవీందర్, జ్ఞానేశ్వర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, పాఠశాల ఇంచార్జ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపిన జూనియర్ కాలేజ్ బృందం

# రావులపల్లిలో ఎమ్మెల్యే జీఎంఆర్‌చే కుట్టుమిషన్ల పంపిణీ

**భూత్పూర్,జూన్13,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం రావులపల్లి గ్రామంలో గ్రామ స్వరాజ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సబ్సిడీపై పంపిణీ చేసిన కుట్టుమిషన్లను దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ స్వరాజ్ సంస్థ స్వచ్ఛందంగా ముందుకు నిరుపేద మహిళలు,వితంతువులు,బాలికలకు ఉచితంగా టైలరింగ్ నేర్పడంతో పాటు వారికి సంస్థ తరఫున యాభై శాతం సబ్సిడీతో పంపిణీ చేయడం ఎంతో హర్షింపతగ్గ అంశమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పప్పుల సుధాకర్,మేనేజర్ రాములమ్మలను ఎమ్మెల్యే జీఎంఆర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రావులపల్లి మొల్గర నర్సింహులు,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్‌తో పాటు నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకటేష్, కొండన్న,సంజీవరెడ్డి,కరుణాకర్‌గౌడ్,మాసగౌడ్,రాంరెడ్డి,కిట్టురెడ్డి,టీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






రావులపల్లిలో కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంబించి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

# రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారు

**లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసుల పరిష్కారం**

**నేడు జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ సద్వినియోగం చేసుకోవాలి**

**ప్రిన్సిపల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బి.పాపిరెడ్డి**



**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్13 ప్రభాతవార్త:** ఇరువురు వివిధ కేసుల్లో ఇరుక్కొని కొట్లాడుకుంటే ఒక్కరే గెలుస్తారని రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారని ప్రిన్సిపల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బి. పాపిరెడ్డి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 14న శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమయ్యే కేసులకు హైకోర్టులో అపీల్ ఉండదని పేర్కొన్నారు. పరిష్కరించుకోదగిన కేసులను లోక్ అదాలత్‌లో పాల్గొని రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులు లోక్ అదాలత్‌లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎట్టకేలకు కంచె ఏర్పాటు

**ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం**

**జడ్చర్ల, జూన్ 13 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో గత వారం రోజుల కింద కంచలేని ట్రాన్స్ఫార్మర్ వద్ద ప్రమాదానికి గురై బాలుడి మృతి చెందిన సంఘటన అందరికీ తెలిసిందే. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులపై ఫైర్ అయ్యారు. ఎక్కడ ట్రాన్స్ఫార్మర్ ఉన్న ఇమ్మీడియేట్‌గా కంచె ఏర్పాటు చేయాలని ఫెన్సింగ్ పకడ్బందీగా నిర్మించాలని ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం సరస్వతి నగర్ కాలనీలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ప్రీ కాస్ట్ కాంపౌండ్ వాల్ నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి సరస్వతీ నగర్ కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే జడ్చర్ల మున్సిపాలిటీలోని ప్రమాద భరితంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లను గుర్తించి వాటి చుట్టూ కూడా కంచెలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.



సరస్వతీ నగర్లో ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

# సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న డీఈఓ

**దేవరకద్ర,జూన్ 13 ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం షెడ్యూల్లో భాగంగా ఈరోజు ప్రాథమిక పాఠశాల నార్లోని కుంటలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఎమ్ఓ దుంకుడు శ్రీనివాస్,దేవరకద్ర మండల విద్యాధికారి పి.బలరాం,కోయిల్‌సాగర్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రమేష్ పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న అన్ని రకాల కార్యక్రమాలను ప్రజలకు, తల్లిదండ్రులకు వివరిస్తూ, చిన్నారుల సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గ్రామస్తులు అందరి సమక్షంలో వైభవంగా నిర్వహించటంలో భాగస్వామ్యులు కావటం జరిగింది.దీనిలో భాగంగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత పాఠశాల దుస్తులు అందించడం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్, రఘువర్ధన్ రెడ్డి, నోమేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఘనంగా దయాకర్ రెడ్డి ద్వితీయ వర్ధంతి

**నారాయణ పేట, జూన్ 13 ప్రభాతవార్త :** ఉట్కూరు మండల కేంద్రంలోని దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి ఎనలేని కృషి చేశారని మాజీ జడ్పీటీసీ సూర్యప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోహన్ రెడ్డి అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని శుక్రవారం దయాకర్ రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మెయిన్ బజార్, హనుమాన్ ఆలయ ప్రాంగణంలో చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళి అర్పించారు."అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాలో రోగులకు పండ్లు, బ్రెడ్డు, బిస్కెట్లు పంపిణీ చేశారు. దయాకర్ రెడ్డి గ్రామీణ ప్రాంతాలలో విద్య, వైద్యం, త్రాగునీరు, రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీతా దయాకర్ రెడ్డి, యువసేన మండల అధ్యక్షుడు నరసింహ గౌడ్, మాజీ ఎంపీపీ మణెమ్మ గోపాల్ రెడ్డి, లక్ష్మయ్య, పీహెచ్‌సీ వైద్యురాలు భవాని, ఏఎన్ఎంలు శైలజ, నాగమ్మ, నర్సింహులు పాల్గొన్నారు.

# గండీడ్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి**

**గండీడ్, జూన్ 13, ప్రభాతవార్త;** గండీడ్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గండీడ్ మండలంలో పెద్దవార్వాల్ గ్రామంలో సిసి రోడ్లు, అంగన్వాడి భవనాన్ని ప్రారంభోత్సవంచేసి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ, ఐమాక్స్ లైట్ల ఏర్పాటు కోసం శంకుస్థాపన, రైతు వేదికలో భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వెన్నచేడ్ గ్రామం నుండి జిన్నారం గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి, ఐమాక్స్ లైట్ల నిర్మాణం కోసం భూమి పూజ, కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ, మన్సూర్ పల్లి గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభోత్సవం చేశారు. గండీడ్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గండేడ్ మండలం అభివృద్ధి సాధ్యమని, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

# సామూహిక అక్షర అభ్యాసనలో డీఈఓ

**నారాయణపేట టౌన్, జూన్ 13 ప్రభాతవార్త :** బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణపేట మండలం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాలలో అధిక సంఖ్యలో అడ్మిషన్ చేయించాలని పాఠశాలలో అన్ని వసతులు ఉంటాయని వాటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఆశిస్తున్న ఆంగ్ల మాధ్యమ బోధన ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత చక్కగా కొనసాగుతున్నదని తెలియజేశారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ ఏకరూప దుస్తులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించడం జరుగుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మజ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బాలమణి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, నరసింహ, లక్ష్మణ్, ప్రతాప్, రఘురాం రెడ్డి, మధుసూదన్ రావు, బాలకృష్ణ, గీత, రజిత, అంగన్వాడి టీచర్ కమలాబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం : ఎమ్మెల్యే

**పెబ్బేరు,జూన్ 13 ప్రభాతవార్త:**మండలంలోని యాపర్ల గ్రామంలో ఏరువాక పున్నామి సందర్భంగా జాతర జరుగుతున్న ఉత్సవాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాపర్ల, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల చదువులకోసం ప్రభుత్వం ఎన్నో చక్కనిసౌకర్యాలు ఉచితపుస్తకాలు దుస్తులు భోజనం అందిస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే అన్నివిధాల ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు.యాపర్లలో దాతల సహకారంతో పాఠశాల వసతులు సమకూర్చుకోవడం అభినంద నీయం అని అన్నారు. ఈనాటి కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం పలుస శంకర్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరసింహ రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషేన్, భాగ్యలక్ష్మి, గ్రామ నాయకులు రాంరెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు స్వరజ్జం బాబు రెడ్డి, భీముడు, శ్యాం, దామోదర్, ఉపాధ్యాయులు మొహినొద్దిన్, వెంకటేశ్వర్లు, బాలమ్మ, ఈశ్వర్ రెడ్డి, శ్రీధర్, మురళీ కృష్ణ, ఇందిరమ్మ, రమేష్,ఆంజనేయులు, సి.శివాని,అనూష విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# మొదటి మహాసభ జయప్రదం చేయండి

**దేవరకద్ర, జూన్ 13 ప్రభాతవార్త :** మహాసభ ముఖ్యఅతిథిగా టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిహెచ్ రామచందర్ టియుసిఐ రాష్ట్ర సహకార దర్శి సి.వెంకటేశు పాల్గొని ప్రసంగిస్తారు. ప్రధానంగా ఈ దేశంలో 47 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారు వీరికి పూట గడవని స్థితిలో కనీస వేదం చట్టాల్ని అమలు చేయడం లేదు ప్రధానంగా ఈరోజు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 26వేల వేతనం ఉంటే గాని జీవించే పరిస్థితులు ఉన్నాయి. కావున కేంద్ర ప్రభుత్వం ఈ కనీస వేతన చట్టాలను అమలు చేయకుండా ఉన్న 44 కార్మిక లేబర్ చట్టాలను పూర్తిగా రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగింది దీనివల్ల పనిగంటలు పెరగడం 73 శాఖలకు సంబంధించిన వేతనాలు పెంచకపోవడం ఈఎస్ఐ పిఫ్ సక్రమంగా అమలు చేయకుండా భద్రత కల్పించకుండా సోషల్ సెక్యూరిటీ అమలు చేయకుండా సంఘాల నిర్మాణాన్ని రద్దు చేస్తూ వచ్చిన ఈ కోడ్లకు వ్యతిరేకంగా ఈ యొక్క మహాసభను జరుపుకోవడం జరుగుతా ఉన్నది కావున అధిక సంఖ్యలో వచ్చి ఈ యొక్క మహాసభను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో నాయకులు సాంబశివుడు, బి.బాలస్వామి, వీరన్న, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

# ప్రజలకు ఏ సమస్య వచ్చినా బిజెపి అండగా ఉంటుంది

**బిజెపి రాష్ట్ర నాయకులు నామాజీ**

**ఏరియా ఆసుపత్రి తరలింపుపై పేటలో బిజెపి దీక్ష నాలుగు రోజుల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయకపోతే ఉద్యమం తప్పదు**

**నారాయణపేట టౌన్, జూన్ 13 ప్రభాతవార్త :** ప్రజలకు ఏ సమస్య వచ్చినా బిజెపి పార్టీ అండగా ఉంటుందని ప్రజలకు వైద్యాన్ని అందుబాటులో పెట్టలేని ప్రభుత్వం గద్దెదిగాలన్నారు. పేట ఏరియా ఆసుపత్రిని తరలిస్తూ ప్రత్యామ్నాయ ఆసుపత్రి ఏర్పాటు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నర్సిరెడ్డి చౌరస్తా వద్ద 24 గంటల నిరాహార దీక్ష బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అధ్యక్షతన కొనసాగింది. ఇట్టి కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు రతంగ్ పాండు రెడ్డి ప్రారంభించారు. దీక్షను ఉద్దేశించి బిజెపి రాష్ట్ర నాయకులు నాగురా నామాజీ, రాష్ట్ర నాయకులు రతంగ్ పాండు రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ మాట్లాడుతూ బిజెపి పార్టీ రాజకీయ పార్టీయని ప్రజలను అన్యాయం జరిగితే ప్రభుత్వం మెడలు వంచి సమస్య పరిష్కారం కోసం పోరాడి పార్టీ బిజెపి అన్నారు. భారతీయ జనతా పార్టీ దేశ రక్షణతో పాటు ప్రజలకు ఏ సమస్య వచ్చిన అండగా పనిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే పని తీరు బాగు లేని కారణంగా అగ్రికల్చర్ పాలిటెక్నికల్ కాలేజ్, సైనిక్ స్కూల్ ఎందుకు కాలేదన్నారు. 60 వేల జనాభా ఉన్న నారాయణపేట ఎమ్మెల్యేకు ఎందుకు కనిపించడం లేదన్నారు. ఏరియా ఆసుపత్రిని అప్పట్లో పర్ణిక రెడ్డి కన్‌స్ట్రక్షన్ పేరిట శివకుమార్ రెడ్డి కట్టారన్నారు. 25 సంవత్సరాలు కాకముందే శిథిలావస్థకు చేరడం నాసిరకమైన పనులు చేయడమే కారణమన్నారు. ఈ భవనంపై విచారణ చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాలకు వెళ్ళిన రోగులు కళాశాల నుండి పేటకు పేట నుండి కళాశాలకు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏరియా ఆసుపత్రి తరలింపులో పెద్ద కుంభకోణం జరుగుతుందని విచారణ జరపాలన్నారు. ఉద్యమం చేయంది సమస్యలను ఎందుకు స్పందించడం లేదన్నారు.69 జీవో అమలు, నారాయణపేట జిల్లా ఏర్పాటు, రోడ్లు, డాక్టర్ల సమస్య, ఉద్యమాలతోనే పరిష్కరించుకున్న ఘనత బిజెపి పార్టీ కే దక్కిందన్నారు. మోడీ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. శాంతియుతంగా ఉద్యమం చేస్తున్నామని నిర్లక్ష్యం చేసే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బిజెపి అంటే బీద జనుల పార్టీ అన్నారు. రాజకీయాలు వచ్చేటప్పుడు వస్తుంటాయి. గెలుపోటములు సహజమన్నారు. ప్రతిదీ రాజకీయ కోణంలో ఆలోచించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ ప్రజలకు వైద్యం అందకుండా చేసిందన్నారు. జిల్లా ఆస్పత్రిని తరలించడాన్నీ తప్పు పట్టడం లేదని ఇందులో ఎలాంటి రాజకీయం లేదని అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రిని తరలించినప్పుడు దాదాపు 60 వేల జనాభా ఉన్న జిల్లా కేంద్రంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు ఎందుకు చేయలేదనీ ప్రశ్నించారు. దాంతో పట్టణ ప్రజలు వైద్యానికి దూరమయ్యారనీ అందరూ ప్రైవేట్ ఆస్పత్రులకు వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో బిజెపి ఎల్లవేళలా సహకరిస్తుందని ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న మెడికల్ కాలేజీకి ఆస్పత్రిని తరలించి అక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. సిఎం.సొంత జిల్లాలో ఆస్పత్రి లేని పరిస్థితి దాపురించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బస్తీ దవాఖానలు,పల్లె దవాఖానలు ఏర్పాటు చేసి ప్రజల ముంగిటికి వైద్యం తీసుకు వస్తుంటే జిల్లా కేంద్రంలోనే ఈ ప్రజా ప్రభుత్వ పాలన వైద్యం లేకుండా చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి సిఎం వచ్చిన కనీసం కిలో మీటర్ రోడ్డు వేయక పోవడం సిగ్గుచేటు అన్నారు. అలాంటి కాలేజీలో జిల్లా ఆస్పత్రి ఏర్పాటు చేసి ప్రజలకు ఏలాంటి వైద్యం అందించాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. పట్టణంలో ఆస్పత్రి ఉన్నపుడు రోజుకు 100 వరకు కాన్పులు నెలలో 400 వరకు ఆపరేషన్లు అయ్యేవి అన్నారు. నేడు 5 కాన్పులు జరగడం లేదని అన్నారు. ఓపి రోగులు ఇక్కడ 5,6 వందల మంది ఉంటే అక్కడ వంద మందికి దాటడం లేదన్నారు. రోడ్డు సౌకర్యం లేక విద్యుత్ దీపాలు లేక రోగులు అవస్థలు పడి వైద్యం కోసం వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిన రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు దారి మళ్లిస్తున్నారనీ దీని కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు అన్నారు. నాలుగు రోజుల్లో జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రినీ ఏర్పాటు చేయాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య చికిత్సలకు,గర్భిణీలకు స్కానింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, చిన్న పిల్లలకు వైద్యం కల్పించాలని, జిల్లా ఆస్పత్రికి 24 గంటలు అంబులెన్స్ సౌకర్యం ఉండాలని, జిల్లా కేంద్రంలో వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆస్పత్రి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులతో పాటు, వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాగూరావు నామోజీ

# అక్రమ మద్యం అమ్మకాలపై కళ్ళు మూసుకున్నారా

**భోజనం హోటళ్లలో జోరుగా మద్యం అమ్మకాలు**

**ఆబ్కారీ శాఖ మంత్రి జిల్లాలోనే ఎదేచ్ఛగా అక్రమ దందా**

**హద్దు మీరుతున్న మందుబాబుల వీరంగాలు**

**చోద్యం చూస్తున్న అబ్కారీ శాఖ అధికారులు**

**ఎక్సైజ్ అధికారుల తీరుపై రాచాల ఫైర్**

**వనపర్తి, జూన్13 ప్రభాతవార్త:**వనపర్తి జిల్లాలో భోజనం హోటళ్లలో చట్ట విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరుగుతున్న కూడా కళ్ళు మూసుకొని చోద్యం చూస్తున్నారా? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఎక్సైజ్ అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను కలిసి అక్రమ మద్యం అమ్మకాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....భోజనం పేరుతో హోటళ్లు నడుపుతున్న కొందరు గుట్టు చప్పుడు కాకుండా మద్యం అమ్మకాలను అక్రమంగా నిర్వహిస్తున్నారని, కట్టడి చేసి కఠిన చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. స్వయంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే ఈ విధంగా అక్రమ మద్యం అమ్మకాలు భోజన హోటళ్లలో జరుగుతుంటే మిగతా జిల్లాల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. హోటళ్లలో అక్రమ మద్యం దందా కొనసాగుతుండటంతో మహిళలు, సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు అక్రమ మద్యం అమ్మకాలపై ఫిర్యాదు చేస్తున్న రాచాల బృందం

అక్రమ మద్యం అమ్మకాల వల్ల మందుబాబులు తాగిన మైకంలో వీరంగం సృష్టించిన సంఘటనలు కూడా జిల్లాలో ఇప్పోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. మహిళలు భోజనం చేయడానికి హోటళ్లకు వెళ్లాలంటే జంకుతున్నారని, ఈ తతంగం జిల్లాలో కొనసాగుతున్న విషయం అధికారులకు తెలిసిన కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ పనులను త్వరగా పూర్తి చేయాలి

**నారాయణపేట,జూన్ 13 ప్రభాతవార్త :** కోస్గి మండలంలో శుక్రవారం సుడిగాలి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గుండు మాల్ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని బేస్‌మెంట్ లెవెల్ పరిశీలించారు. అలాగే బొగరం గ్రామ పంచాయతీలో పాఠశాలలో పనులను పర్యవేక్షించడం జరిగింది. బొగరం నుండి అంలికుంట్ల రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. కడంపల్లి నుండి హనుమాన్ పల్లి గ్రామాలకు కలుపుతూ బ్రిడ్జ్ నిర్మాణం పనులను పరిశీలించి అక్టోబర్ వరకు బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేస్తమాన్ని అధికారులు కలెక్టర్‌కి తెలిపారు. తోగపూర్ గ్రామం నుండి పందిరి హనుమాన్ గ్రామ పంచాయతీ వరకు 4 కిలోమీటర్ రోడ్డు నిర్మాణ పనులను ఆగస్టు మొదటి వారం వరకు పూర్తి చేయాలని సూచించారు. కోస్గి మండలం సర్జఖాన్ పేట్‌లో జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాల పనులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. ఉదయం బ్రేక్ ఫస్ట్ ఇచ్చారా లేదా అనే విషయాన్ని విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను ఇవ్వాలని అలాగే పాఠ్యపుస్తకాలను నోటు పుస్తకాలను అందించాలని ఆదేశించారు. గత సంవత్సరం విద్యార్థుల సంఖ్య ఇప్పుడున్న విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోతిరెడ్డిపల్లి నుండి గుండాల్ వయా సర్జఖాన్ పేట్ రోడ్లను పరిశీలించారు. పోతిరెడ్డిపల్లి నుంచి జిన్నారం రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరిత్తగతిన కొడంగల్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంబడి సంబంధిత అధికారులు కోస్గి ఎంపీడీవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

# ప్రయాణికులకు షాక్ ఇచ్చిన కర్ణాటక ఆర్టీసీ బస్సు

**మార్గ మధ్యలోనే ప్రయాణికుల్ని బస్ నుంచి దించేసిన కర్ణాటక ఆర్టీసీ సిబ్బంది**

**డ్రైవర్ నిద్రమత్తు కారణం అంటున్న ప్రయాణికులు**

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 13 ప్రభాతవార్త:** కర్ణాటక యాదగిరి డిపోకు చెందిన కర్ణాటక ఆర్టీసీ బస్సు యాదగిరి నుంచి శ్రీశైలంకు బయలుదేరింది. కానీ శుక్రవారం రోజు ఉదయం నారాయణపేట మండలం సింగారం చౌరస్తా సమీపంలో ప్రధాన రోడ్డు మధ్యలోనే డ్రైవర్ బస్సును ఆపేశారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులంతా షాక్‌కు గురయ్యారు. ఏం జరిగిందంటూ కండక్టర్‌ని వివరణ తీసుకోగా బస్సు నడిపే పరిస్థితుల్లో డ్రైవర్ లేరని తను నిద్ర మత్తులో ఉన్నారంటూ బస్సు నుండి ప్రయాణికులంతా దిగిపోవాల్సిందిగా కోరారు. ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం పద్ధతంటూ కండక్టర్‌ను సిబ్బందిని నిలదీశారు. మార్గ మధ్యలో ఇలా తమను రోడ్డుపై వదిలేయడం ఏంటని ప్రశ్నించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నారని బస్సులు ముందుకు నడిపే స్థితిలో లేరని కండక్టర్ ప్రయాణికులకు సమాధానం ఇచ్చారు. ఆర్టీసీ బస్సు సిబ్బంది చెప్పిన కారణంతో ప్రయాణికులు ఒకింత అవాక్కయ్యారు. ఆర్టీసీ సిబ్బంది తీరు వివాదాస్పదం మారుతూ కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. బస్ కండక్టర్ ప్రయాణికులంతా కిందకు దించేసి టికెట్ డబ్బులు తిరిగి వారికి చెల్లించారు. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులు నోరెళ్లబెట్టారు. గమ్యస్థానానికి తీసుకెళ్లకుండా మధ్యలోనే బస్సును ఆపి వేరే బస్సులో వెళ్ళండి అని చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. ప్రయాణికులు చెప్పిన లెక్క ప్రకారం బస్సులో దాదాపు 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నారని తెలుస్తోంది .. ఇలా చెప్పాపెట్టకుండా నడిరోడ్డుపై దించేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం తీసుకెళ్లకుండా నారాయణపేట నడిరోడ్డులో దింపటం ఏంటని ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందిపై మండిపడ్డారు. ఎటు కాకుండా మార్గమధ్యంలో బలి చేయడం దారుణమంటు కర్ణాటక ఆర్టీసీ ఇబ్బంది పై మండిపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తులో బస్సు ముందు కూడా కదిలించలేని పరిస్థితిలో ఉన్నారని ప్రయాణికులకు కండక్టర్ సమాధానం ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఒకపక్క ప్రయాణికులంతా కండక్టర్ తో గొడవ పడుతుంటే డ్రైవర్ మాత్రం కూర్చున్న డ్రైవింగ్ సీట్లోనే బస్సు స్టీరింగ్ పై అలాగే నిద్రమత్తులోకి జారుకున్నారు. అటువైపు వస్తున్న వాహనదారులు ప్రజలు డ్రైవర్ ఎంత పిలిచిన లేవకపోవడంతో ప్రధాన రోడ్డుపై వెళుతున్న వాహనాలకు అంతరాయం కలిగింది. వేరే డ్రైవర్ సాయంతో బస్సును రోడ్డు పక్కకు నిలపడం జరిగింది.






ప్రయాణికులకు టికెట్ డబ్బులు చెల్లిస్తున్న కండక్టర్ ( ఇన్‌సెట్లో ) బస్సులో నిద్రిస్తున్న డ్రైవర్

# ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై కొరడా..

**మూడు స్కూల్ బస్సులను సీజ్ చేసిన ఆర్టీఏ అధికారులు**

**మానవపాడు, జూన్ 13 ప్రభాతవార్త :** నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న స్కూల్ బస్సులపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. స్కూల్స్ రీ ఓపెన్ కావడంతో విద్యార్థులను చేరవేసే బస్సులను కండిషన్లో ఉన్నాయా లేదా అనేది చెక్ చేస్తున్నారు. బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా ఆర్టీఏ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి అలంపూర్ శాంతినగర్ గద్వాల ప్రాంతాలలో స్కూల్ బస్సులపై ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులలో విద్యార్థులను చేరవేస్తున్నారని ముందస్తు సమాచారంతో విద్యార్థుల దృష్టిలో ఉంచుకొని తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ లేని మూడు బస్సులను సీజ్ చేసినట్లు ఆర్టీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తప్పనిసరిగా స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ పొందాలని రవాణా శాఖ ఉత్తర్వులను ఉల్లంఘించి ఫిట్‌నెస్ లేని వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల విషయంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు నిర్లక్ష్య ధోరణి వీడాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ బస్సులపైన ప్రత్యేక దృష్టి సారించామని ఈ తనిఖీల్లో ఆర్టీఏ అధికారులు పాల్గొన్నారు.



స్కూల్ బస్సును సీజ్ చేసిన ఆర్టీఏ అధికారులు

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

**శ్రీరంగాపూర్, జూన్ 13 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని నగరాల 1వ సెంటర్ నందు శుక్రవారం రోజు భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. గ్రామ రైతు లు ఈ సదస్సులో పాల్గొని తమ యొక్క భూ సమస్యలను శ్రీరంగాపూర్ తహసిల్దార్ రాజు దృష్టికి తీసుకువచ్చి అర్జీలను పెట్టుకోవడం జరిగింది. మొత్తం 24 అర్జీలు రావడం జరిగింది. తాసిల్దార్ రాజు మాట్లాడుతూ ఈ సదస్సులో రైతులు తమకు సంబంధించిన భూ సమస్యలను దరఖాస్తు చేసుకున్న వారి యొక్క దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు రెవెన్యూ అధికారులు పాల్గొనడం జరిగింది.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

**దేవరకద్ర,జూన్ 13 ప్రభాతవార్త :** దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డా. కృష్ణ ఆకస్మికంగా శుక్రవారం నాడు సందర్శించారు. హాస్పిటల్‌లో ఒపీఐపీ కాన్పుల గురుంచి అడిగి తెల్సుకున్నారు. అలాగే వానకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగు జాగ్రత్తలు తీసుకోమన్నారు డ్రై డే కార్యక్రమం నిర్వహించమని తెలియజేసారు అలాగే ఐడిసిఎఫ్ ఇంట్రెస్ట్ డయర్ ఫీల్ క్యాంపియన్ ఫర్ నైట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటింటా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ జింక్ మాత్రలు పంపిణి చేయమని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులకు అక్షరాభ్యాసం




అక్షరాభ్యాసం చేస్తున్న ఏఎంవో శ్రీనివాస్

**మహబూబ్‌నగర్, జూన్ 13, ప్రభాతవార్త :** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జూన్ 13 నూతన విద్యార్థు లకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పరిధిలోని బోయపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఏఎమ్ఓ దుంకుడు శ్రీనివాస్ అక్షరాభ్యాసం చేయించారు. సందర్భంగా ఏఎంఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో తమ చిన్నారు లను చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి విద్యార్థుల నుంచి కంప్యూటర్ విద్యను పాఠ్యాంశంగా అందించబోతున్నామని అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉంటారని తెలియజేశారు.